సాక్షి మంచిర్యాల

శుక్రవారం : 26 : ఏప్రిల్ : 2024



సమస్యలు పరిష్కరిస్తేనే ఓటు..!

కోటపల్లి మండలం రాజారం గ్రామాన్ని సమస్యలు వెంటాడుతున్నాయి. ఎన్నికలను బహిష్కరిస్తూ తీర్మానించగా అధికారులు సంప్రదింపులు జరిపినా ప్రయోజనం లేకపోయింది. IIలో▸



ఎంవీకే ఓపెన్‌కాస్ట్ లేనట్టేనా

మహావీర్‌ఖని ఓపెన్‌కాస్టుపై నీలినీడలు కమ్ముకున్నట్లు కనిపిస్తోంది. రెండేళ్ల నుంచి ఆర్భాటంగా సాగిన సర్వే పనుల్లో స్తబ్ధత నెలకొనడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. IIలో▸

గరిష్ఠం/కనిష్ఠం

42.0 /28.0

వాతావరణం

ఉదయం వేళ ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. రాత్రివేళ మేఘావృతమై ఉంటుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి సైన్స్ సమ్మర్ క్యాంపు

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలో ఈ నెల 26నుంచి సైన్స్ సమ్మర్ క్యాంపునకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు 15రోజులపాటు విజ్ఞాన శాస్త్రాలపై ఉచిత శిబిరాలు నిర్వహిస్తారు. గ్రామీణ ప్రభుత్వ పాఠశాలలకు ప్రయోగాత్మక సైన్స్ విద్య అమలు చేస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆలోచనలను మార్చడంతోపాటు ప్రేరేపించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ముందుగా ఆరు నుంచి 9వ తరగతి విద్యార్థులకు అవకాశం కల్పిస్తారు. శిక్షణ శిబిరంలో పాల్గొనడానికి గూగుల్ ఫారం ద్వారా ఇప్పటికే 224మంది దరఖాస్తు చేసుకోగా.. 106మందికి అవకాశం కల్పించారు. ప్రాధాన్యతక్రమంలో 8, 9వ తరగతుల విద్యార్థులను ఎంపిక చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 29మంది అన్ని తరగతుల విద్యార్థులను శిక్షణ శిబిరానికి అవకాశం కల్పించారు. పాఠ్య పుస్తకాన్ని ప్రయోగాత్మకంగా, భయం నుంచి విశ్వాసానికి మార్చడానికి, సబ్జెక్టు నిపుణుల సెషన్, ప్రేరణాత్మక సెషన్‌లు, ఎలక్ట్రానిక్, రోబిటిక్ సెషన్‌లపై నేర్పిస్తారు. వేసవి జాగ్రత్తలు తీసుకుంటూ తల్లిదండ్రుల పర్యవేక్షణలో విద్యార్థులు వేసవి శిబిరానికి హాజరయ్యేలా చొరవ తీసుకోవాలని డీఈవో యాదయ్య సూచించారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ప్రారంభం

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో ఓపెన్‌స్కూల్, ఇంటర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. మంచిర్యాలలో పదో తరగతికి 2, ఇంటర్‌కు 3, బెల్లంపల్లిలో పదో తరగతికి 1, ఇంటర్‌కు 2 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటి రోజు పదో తరగతి పరీక్షలకు 626 మందికి గాను 525 మంది హాజరయ్యారు. ఇంటర్‌లో 1,165 మందికి గాను 986 మంది హాజరు కాగా 179 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి, ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు ఎనిమిది పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

ఇద్దరు ఇన్విజిలేటర్ల తొలగింపు

బెల్లంపల్లి బజార్ ఏరియా స్కూల్ పరీక్ష కేంద్రంలో ఇద్దరు ఇన్విజిలేటర్లను విధుల నుంచి తొలగించారు. ఓపెన్ ఇంటర్ పరీక్షల నేపథ్యంలో తరగతిలో ఉండకపోవడం.. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తొలగించినట్లు డీఈవో యాదయ్య తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో సీఓఈ విద్యార్థుల సత్తా

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ) కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్ సెకండ్ సెషన్ ఫలితాల్లో సత్తా చాటారు. తొమ్మిది మంది అడ్వాన్స్‌డ్‌కు ఎంపికయ్యారు. దుర్గం చరణ్‌తేజ్ 85.04, అడే నవనీత్(ఎస్టీ విభాగంలో) 54.61, తీగల అక్షిత్ 83.64, దుర్గం అకిరానందన్ 75.50, రామటెంకి శివ 73.27, వెల్తూరి అఖిల్ 72.87, బత్తుల మధు 69.76, ఎరిగిరాల సాయిచరణ్ 65.62, లింగంపల్లి అంజి 63.39 పర్సంటైయిల్ సాధించారు. వచ్చే మే 26న జరిగే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు దేశ వ్యాప్తంగా ఉన్న ఐఐటీల్లో అడ్మిషన్ కల్పిస్తారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, సీఓఈ సూపరింటెండెంట్ అవధూత రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ కోట రాజ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో ప్రతిభకనబర్చేలా ప్రత్యేక శిక్షణ ఇస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

రిశ్వికకు 986వ ర్యాంక్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నంనూర్ గ్రామానికి చెందిన ఒడ్డె రిశ్విక జేఈ ఈ మెయిన్స్ ఫలితాల్లో 986వ ర్యాంకు సాధించింది. ఒడ్డె లక్ష్మి, బాలరాజు దంపతుల కూతురు రిశ్విక పదో తరగతిలో 9 జీపీఏ, ఇంటర్ ఎంపీసీలో 951 మార్కులు సాధించింది. జేఈఈ మెయిన్స్‌లో ఓబీసీ పీడబ్ల్యూడీ విభాగంలో జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించిన రిశ్వికను పలువురు అభినందించారు.

మలేరియా నివారణకు జాగ్రత్తలు

నస్పూర్: మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు అన్నారు. గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా పట్టణ పరిధిలోని జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కేంద్రం పీహెచ్‌సీ వద్ద ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. మెడికల్ ఆఫీసర్ సమత, సబ్‌యూనిట్ అధికారి జీ.నాందేవ్, హెల్త్ ఎడ్యుకేటర్ ఏ.శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

దండేపల్లి: ఎండల తీవ్రతతో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు వైద్య సిబ్బందికి సూచించారు. దండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. అనంతరం ఆసుపత్రిలో మందుల నిల్వలపై వైద్యుడు సతీష్‌ను అడిగి తెలుసుకున్నారు.

కొనుగోలుకు కొర్రీల్లేవ్



లక్సెట్టిపేట మండలం లక్ష్మీపూర్‌లో రైస్‌మిల్లర్‌తో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్, అధికారులు



బస్తాను తూకం వేసి చూస్తున్న అదనపు కలెక్టర్

వడ్లు తడిసినా కొంటాం

వర్షంతో ధాన్యం తడిస్తే రైతులు ఆందోళన చెందొద్దు. తడిసినవి కూడా కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. రైతులు వడ్లను కేంద్రానికి తాలు, దుమ్ము లేకుండా తీసుకొచ్చి మద్దతు ధర పొందాలి. ఎలాంటి సమస్యలు ఉన్నా మా దృష్టికి తెస్తే పరిష్కరిస్తాం.

– ఎస్.మోతీలాల్ అదనపు కలెక్టర్(రెవెన్యూ)

- ధాన్యం సేకరణలో మారుతున్న తీరు
- గతంతో పోలిస్తే మేలేనంటున్న రైతాంగం
- ఇదేతీరుగా ఉంటే తిప్పలు తప్పినట్లే..
- అదనపు కలెక్టర్, అధికారుల కృషితో సమస్యలు దూరం

ధాన్యం కొనుగోళ్ల వివరాలు

కేంద్రాలు	262
సేకరిస్తున్నవి	92
గన్నీ సంచులు కావాల్సింది	43.55లక్షలు
అందుబాటులో ఉన్నవి	3.11లక్షలు
ధాన్యం కొన్నది	18,722మెట్రిక్ టన్నులు
అమ్మిన రైతులు	2,289మంది
ధాన్యం విలువ	రూ.41.25కోట్లు
మిల్లులకు చేరింది	13,473మెట్రిక్‌టన్నులు
ట్యాబ్‌లో నమోదు	3,578మెట్రిక్‌టన్నులు
నగదు నమోదు	రూ.7.29కోట్లు
నమోదైన రైతులు	541మంది
జమ చేయాల్సిన నగదు	రూ.6.40కోట్లు
రైతులకు చెల్లించింది	రూ.90లక్షలు
గురువారం విడుదలైన మొత్తం	రూ.కోటి

41కిలోలే జోకుతున్నారు



వరి ధాన్యం అమ్మకాల్లో గతేడాది పోలిస్తే ఈ ఏడాది రైతులకు ఇబ్బందేమీ లేదు. ధాన్యం బస్తాకు 41కిలోలే జోకుతున్నారు. ఇట్లనే రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి. ధాన్యం కోత విధించడం లేదు.

– కొండపల్కల మొగిళి, గ్రామం: కొత్తూరు, మం: లక్సెట్టిపేట

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ధాన్యం కొనుగోళ్లలో అక్రమాల నిరోధానికి జిల్లా యంత్రాంగం కృషి చేస్తోంది. జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) సబావత్ మోతీలాల్ చొరవతో రైతులకు గోస తప్పుతోంది. ఏటా సీజన్‌లో తరుగు, తేమ, నాణ్యత, జాప్యం, మిల్లర్ల తీరుతో రైతులు నష్టపోవాల్సి వస్తోంది. ఈసారి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు అప్రమత్తంగా ఉంటూ చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు గురువారం విలేకరుల సమక్షంలోనే కొనుగోలు కేంద్రాలు, రైస్‌మిల్లులు, రేషన్‌షాపులు సందర్శిస్తూ క్షేత్రస్థాయిలో పరిస్థితిని తెలియజేశారు.

వరికోత నుంచి మిల్లుల దాకా..

జిల్లాలో 20రోజుల ముందే కొనుగోళ్లు మొదలయ్యాయి. వరి కోత నుంచి ధాన్యం మిల్లుకు చేరేదాకా అన్ని స్థాయిల్లోనూ అప్రమత్తత ఫలితాలనిస్తోంది. రైతు కష్టాన్ని ఎవరూ సొమ్ము చేసుకోకుండా జాగ్రత్త పడుతున్నారు. ధాన్యం కటింగ్, నాణ్యత, అన్‌లోడింగ్, ట్రక్‌షీట్లలో మోసాలు, హమాలీలు, లారీ డ్రైవర్ల చేతివాటాలు, గన్నీ సంచుల కొరత, కొనుగోళ్లలో జాప్యం తదితర సమస్యలు ఉన్నాయి. ఈసారి వరి అధికంగా పండే మంచిర్యాల నియోజకవర్గంలో ఐకేపీ, మెప్మాకు కేంద్రాల అనుమతి ఇచ్చారు. అక్రమాల ఆరోపణలు ఉన్న సహకార, డీసీఎంఎస్‌కు తక్కువగా ఇచ్చారు. తూకం ప్రతీ బస్తాకు 41కిలోలకే పరిమితం చేశారు. ఎక్కువ వేయడం, రవాణా జాప్యం జరిగితే అదనపు కలెక్టర్ రంగంలోకి దిగుతున్నారు. గంటకోసారి మిల్లర్లను అప్రమత్తం చేసి జరిమానా వేస్తామని హెచ్చరిస్తున్నారు. వరికోత యంత్ర డ్రైవర్లతోనూ తాలు రాకుండా ఫ్యాన్ 18 స్థాయి ఉంచాలని కోరుతున్నారు. నాణ్యతపై మిల్లర్ల ముందే నమూనాలు తీసుకుని మరాడిస్తున్నారు. సమస్యలకు 6303928682 నంబరుతో కాల్ సెంటర్ ఏర్పాటు చేశారు. పౌరసరఫరాల, కార్పొరేషన్, గ్రామీణాభివృద్ధి, ఐకేపీ నిర్వాహకులు, మార్కెటింగ్, రవాణా, పోలీసు, మిల్లర్లు, రవాణా కాంట్రాక్టర్లు, డ్రైవర్లతో సమన్వయం చేస్తున్నారు.

ఎండలోనూ పర్యటిస్తూ..

అదనపు కలెక్టర్ గురువారం దండేపల్లి మండలం ముత్యంపేట, లింగాపూర్, లక్సెట్టిపేట మండలం కొత్తూరు, వెంకటాపూర్ తదితర కొనుగోలు కేంద్రాలు, అల్లీపూర్‌లోని రామ్‌లక్ష్మణ్, లక్సెట్టిపేట మండలం లక్ష్మీపూర్ శ్రీరామచంద్ర మిల్లు, హాజీపూర్ మండలం సబ్బెపల్లిలోని ఎంఎస్‌ఆర్ మిల్లును సందర్శించారు. లోడింగ్, అన్‌లోడింగ్, ట్రక్ షీట్లు, ట్యాబ్ నమోదు పరిశీలిస్తూ అప్రమత్తం చేశారు. రోజుకు రూ.కోటివరకు రైతుల ఖాతాల్లో నగదు పడేలా చూడాలని తెలిపారు. హాజీపూర్ మండలం నంనూర్‌లో 41కిలోల కంటే అధికంగా వేస్తున్నారనే ఫిర్యాదుతో కేంద్రానికి వెళ్లి తూకం వేసి చూపించారు. దండేపల్లి మండలం నెల్కివెంకటపూర్‌లో రేషన్ దుకాణానికి వెళ్లి డీలర్ చంద్రయ్యతో బియ్యం రవాణా, పంపిణీ, స్టాక్, వివరాలు చెప్పించారు. డీసీఎస్‌వో ఎంఏ వాజీద్ అలీ, జిల్లా మేనేజర్ గోపాల్, డీపీఎం వేణు, డీఆర్‌డీఏ కిషన్, టెక్నికల్ అసిస్టెంట్ శంషోద్దీన్, ఏఎం మహిపాల్, వరదరాజు ఉన్నారు.

ఎన్నికల్లో ప్రశాంతతకు సహకరించాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

పాతమంచిర్యాల: ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీలు, బరిలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల నిర్వహణ, పోలింగ్ తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని, నీడ, వేసవి దృష్ట్యా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. నిబంధనల ఉల్లంఘన, ఫిర్యాదులను కంట్రోల్‌రూం, సీ-విజిల్ ద్వారా స్వీకరించి వంద నిమిషాల్లో పరిష్కరిస్తామని అన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో వి.రాములు, ప్రత్యేక ఉప పాలనాధికారి చంద్రకళ, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

పాతమంచిర్యాల: లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు 'నేను కచ్చితంగా ఓటు వేస్తాను' అనే నినాదంతో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ సంతోష్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం మహిళలు, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్లకు ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో కిషన్, జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, మహిళలు, వయోవృద్ధులు, విశ్రాంత ఉద్యోగులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల జాతర



వంశీకృష్ణ పక్షాన ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రం అందజేస్తున్న నాయకులు

- పెద్దపల్లిలో 63మంది అభ్యర్థులు.. 109 సెట్లు దాఖలు
- ఆదిలాబాద్‌లో 23మంది అభ్యర్థులు 42 సెట్లు

సాక్షి, పెద్దపల్లి/బెల్లంపల్లి: ఎన్నికల ప్రక్రియలో కీలక నామినేషన్ల ఘట్టం గురువారంతో ముగిసింది. పెద్దపల్లి పార్లమెంటు స్థానానికి మొత్తం 63మంది అభ్యర్థులు 109సెట్లు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. చివరి రోజు అభ్యర్థులు రిటర్నింగ్ అధికారి కార్యాలయాలకు వరుసకట్టారు. గురువారం ఒక్క రోజే అత్యధికంగా పెద్దపల్లి ఎంపీ స్థానానికి 22 మంది అభ్యర్థులు 54 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. పెద్దపల్లిలో బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ అట్టహాసంగా నామినేషన్లు వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణ పక్షాన ఆ పార్టీ నాయకులు గురువారం నామినేషన్ దాఖలు చేశారు. పీసీసీ కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, బెల్లంపల్లికి చెందిన పీసీసీ సభ్యుడు చిలుముల శంకర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్‌ఖాన్‌కు నామినేషన్ పత్రాన్ని అందజేశారు.

నేడు పరిశీలన

శుక్రవారం నామినేషన్ల పరిశీలన నిర్వహిస్తారు. అందులో సరిగా లేనివాటిని తిరస్కరించి, మిగిలిన వాటిని అనుమతిస్తారు. ఇక 26 నుంచి 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. 29న తుదిబరిలో ఎందరు నిలుస్తారన్న విషయంపై స్పష్టత వస్తుంది. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు 15మంది అభ్యర్థులకు సంబంధించి గుర్తులతో ఒక ఈవీఎం ఉంటుంది. అందులో చివరిది నోటా గుర్తుకు కేటాయిస్తారు. పోటీ చేసే అభ్యర్థుల సంఖ్య 15కు మించితే రెండు ఈవీఎంలను ఎన్నికల్లో ఉపయోగించాల్సి ఉంటుంది. ప్రస్తుతం పెద్దపల్లికి 63 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. నామినేషన్ల ఉపసంహరణ తరువాత ఎన్ని ఈవీఎంలు వినియోగిస్తారన్నది తేలనుంది.

- ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి ఆదిలాబాద్‌లో గురువారం చివరిరోజు ఏకంగా 18 మంది అభ్యర్థులు నామినేషన్ వేశారు. మొత్తంగా 23 మంది అభ్యర్థులు.. 42 నామినేషన్లు దాఖలు చేశారు.

సోషల్ మీడియాపై పోలీస్ నిఘా



సెంటర్‌ను పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: సోషల్ మీడియాపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచనున్నారు. గతంలో చట్టవ్యతిరేక పోస్టులతో శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన నేపథ్యంలో రామగుండం పోలీసు కమిషనరేట్‌లో గురువారం సోషల్ మీడియా ట్రాకింగ్ సెంటర్ ప్రారంభించినట్లు సీపీ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని అన్నారు. సోషల్ మీడియా ట్రాకింగ్ ద్వారా గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనరేట్ అడిషనల్ డీసీపీ (అడ్మిన్) రాజు, ఎస్బీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఇన్‌స్పెక్టర్ ముత్తి లింగయ్య, ఎస్సై రాజమణి సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్‌లో ఫెయిల్‌పై సమీక్ష

- ప్రభుత్వ, రెసిడెన్షియల్ కళాశాల ప్రిన్సిపాల్‌లతో సమావేశం
- అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీకి సన్నద్ధత
- ఫెయిలైన వారిపై ప్రత్యేక దృష్టి



ప్రిన్సిపాల్‌లతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న డీఐఈవో శైలజ

మంచిర్యాలఅర్బన్: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో అనుత్తీర్ణతపై అధికార యంత్రాంగం సమీక్ష చేపట్టింది. రాష్ట్ర స్థాయిలో జిల్లా గత ఏడాది ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 17వ స్థానంలో నిలువగా.. ఈసారి 30వ స్థానానికి, గత ఏడాది ప్రథమ సంవత్సరంలో 18వ స్థానం దక్కించుకోగా ఈ ఏడాది 32వ స్థానానికి పడిపోయింది. ఈ నేపథ్యంలో జిల్లా సమీకృత పాలనాధికారి(ఐడీఓసీ) కార్యాలయంలో గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, రెసిడెన్షియల్ కళాశాలల ప్రిన్సిపాల్‌లతో డీఐఈవో శైలజ సమావేశమై సమీక్ష నిర్వహించారు. మెరుగైన ఫలితాలకు రోజంతా సబ్జెక్టుల వారీగా బోధన, ప్రత్యేక తరగతులు నిర్వహించినా వెనుకబాటుకు కారణాలపై ఆరా తీశారు. ఆశించిన మేరకు ఫలితాలు రాకపోవడంపై తెలుసుకున్నారు. హాజరు శాతం తక్కువగా ఉండడం, కళాశాలల నుంచి ఫోన్లు చేసినా విద్యార్థులు, తల్లిదండ్రులు స్పందించలేదనే విషయాన్ని గుర్తించారు. వచ్చే విద్యాసంవత్సరంలో అడ్మిషన్లు పెంచడం కంటే క్రమం తప్పకుండా హాజరయ్యే విద్యార్థులకు ప్రవేశం కల్పించాలని చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులు సింగిల్ సబ్జెక్టుల్లో ఒక్కో కాలేజీలో 26నుంచి 53వరకు తప్పినట్లు తేలింది. రెండు సబ్జెక్టుల్లో ఒక్క కాలేజీలో 44మంది ఫెయిలయ్యారు. ఇందులో గణితం, ఎకనామిక్స్, సివిక్స్ సబ్జెక్టుల్లోనే అనుత్తీర్ణులైనట్లు తేలింది.

అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీపై సన్నద్ధత


అనుత్తీర్ణులైన విద్యార్థుల సన్నద్ధతపై దృష్టి సారించనున్నారు. ఉత్తీర్ణత శాతం మెరుగయ్యేలా అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సద్వినియోగం చేసుకోవాలని ఇంటర్ విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. ఒకట్రెండు సబ్జెక్టులతోపాటు తక్కువ మార్కులతో ఫెయిలైన విద్యార్థులను గుర్తించారు. వారిపై మరింత శ్రద్ధ చూపడం, సబ్జెక్టులపై భయం తొలగిపోయేలా ధైర్యం చెప్పడం, ఆత్మవిశ్వాసంతో అభ్యసన సాగించేలా ప్రోత్సహించనున్నారు. మే 24నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఉండగా.. ఆలోపు సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ నెల 29నుంచి మే 20వరకు ప్రత్యేక తరగతులు నిర్వహణకు నిర్ణయించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు తరగతుల నిర్వహణ, వారానికో టెస్ట్, మోడల్ పేపర్లు అందిస్తామని డీఐఈవో శైలజ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల అధ్యాపకులు వార్షిక ఫలితాల్లో సబ్జెక్టులు తప్పినవారంతా ఉత్తీర్ణులయ్యేలా చొరవ చూపాలని తెలిపారు. గురువారం ప్రభుత్వ, సెక్టార్ కళాశాలల ప్రిన్సిపాల్‌లతో ఇంటర్ ఫలితాలపై సమీక్షించామని, కేజీబీవీ, మోడల్‌స్కూల్, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాల్‌లతో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. ఉత్తీర్ణత శాతం పెంచేలా ప్రయత్నాలు చేస్తామని పేర్కొన్నారు.

ఎంవీకే ఓపెన్‌కాస్ట్ లేనట్టేనా?

- ఎప్పటికప్పుడు మారుతున్న సమీకరణలు
- పెరుగుతున్న పరిహార భారం
- త్వరితగతిన అనుమతులు రాకుంటే అంతేసంగతులు
- ఆచితూచి వ్యవహరిస్తున్న యాజమాన్యం



మూసివేతకు గురైన ఎంవీకే త్రీఇంక్లైన్ గని ప్రాంతం



మాదారం త్రీఇంక్లైన్ ప్రాంతంలో పరిహారం కోసం నిర్మించిన ఇళ్లు

తాండూర్(బెల్లంపల్లి): సింగరేణిలో బెల్లంపల్లి ఏరియాకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. కాలక్రమేణా తన ప్రాభవం కోల్పోతున్న బీపీఏకు పునర్ వైభవం తీసుకొచ్చేందుకు కొత్తగా గోలేటి, మహావీర్‌ఖని ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులను తెరమీదకి తెచ్చారు. ఎంతో ఆవశ్యకమైన ఆయా ఓపెన్‌కాస్ట్ గనులలో ఒకటైన మహావీర్‌ఖని (ఎంవీకే) ఓపెన్‌కాస్ట్ ఏర్పాటుపై నీలినీడలు కమ్ముకున్నట్లు కనిపిస్తోంది. రెండేళ్ల నుంచి ఎంతో ఆర్భాటంగా సాగిన సర్వే పనులు, ప్రాజెక్టు ఏర్పాటు కోసం కొనసాగిన యత్నాలపై ఇటీవల కాలంలో స్తబ్దత నెలకొనడంతో ఓసీపీ ఏర్పాటుపై సవాలక్ష అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

40 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా...

బెల్లంపల్లి ఏరియా పరిధిలో కొత్తగా 40 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా మహావీర్‌ఖని ఓసీపీ ఏర్పాటుకు సింగరేణి యాజమాన్యం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇందుకోసం సుమారు 900 హెక్టార్ల భూమి అవసరం కాగా 12 సంవత్సరాల జీవిత కాలంతో ఈ గని ఏర్పాటుకు అధికారులు సర్వే పనులు పూర్తి చేసినట్లు తెలుస్తోంది.

ప్రతిపాదనల దశలోనే...

ఆర్నెళ్ల కిందటి వరకు కార్పొరేట్ స్థాయిలో జరిగిన ప్రతీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో మహావీర్‌ఖని ఓపెన్‌కాస్ట్‌కు సంబంధించిన ప్రతిపాదనలు, ఈ ఏడాది నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాన్ని పేర్కొనేవారు. కానీ ఇటీవల కాలంలో ఆ ఊసే లేదు. అయితే ఓసీపీ ఇంకా ప్రతిపాదన దశలోనే ఉన్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఓపెన్‌కాస్ట్ ప్రారంభమైతే మట్టి (ఓవర్ బర్డెన్) పోసేందుకు అవసరమైన డంప్‌యార్డులను డోర్లి, కైరిగూడ ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అందుకు కార్పొరేట్ స్థాయి నుంచి అనుమతులు (ఎల్‌వోఏ) రావాల్సి ఉంది. అది వస్తేనే మైనింగ్ ప్లాన్ సిద్ధం చేసి పలు శాఖల అనుమతుల కోసం ఓపెన్‌కాస్ట్ ప్రతిపాదనలు పంపాల్సి ఉంది. కానీ ఇంకా ప్రాజెక్టు పనులు తొలిదశలోనే ఉండడంతో ప్రతిపాదనల దస్త్రాలు పరుగు పెట్టకుండా పోతున్నాయి.

రెండేళ్లలో ప్రారంభమైతేనే...

రాబోయే రెండేళ్లలో అన్ని అడ్డంకులు దాటితేనే మహావీర్‌ఖని ఓపెన్‌కాస్టు ప్రాజెక్టు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో కోలిండియా, ప్రైవేట్ బ్లాకులు, సింగరేణి సంస్థ మొత్తం కలిపి 1000 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని కొనసాగించాయి. ఇది రాబోయే రెండు, మూడు సంవత్సరాల్లో మరో 30 శాతం పెరిగే అవకాశం ఉంది. అదే జరిగితే మార్కెట్ అంచనాల ప్రకారం ఉత్పత్తి అయిన బొగ్గు నిలవలు మిగిలిపోయే అవకాశం ఉంది. దేశీయ మార్కెట్‌లో బొగ్గు డిమాండ్‌ను అనుసరించి సింగరేణి బొగ్గుకు డిమాండ్ లేనిపక్షంలో ప్రాజెక్టు ఏర్పాటుపై సానుకూలత ఉండకపోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పెరుగుతున్న పరిహార భారం

మహావీర్‌ఖని ఓపెన్‌కాస్ట్ ప్రతిపాదిత ప్రాంతాల్లో ఇష్టారీతిన ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. రెండేళ్ల క్రితం ప్రాజెక్టు ప్రతిపాదించిన నాటికి, ఇప్పటికీ ఇళ్ల నిర్మాణాలు మూడింతలయ్యాయి. దీనివల్ల ఓపెన్‌కాస్ట్ ముంపు ప్రాంత వాసులకు ఇచ్చే పరిహారం మరింత పెరిగే అవకాశం ఉంది. రాబోయే కాలంలో బొగ్గు డిమాండ్, ముంపు వాసులకు ఇచ్చే పరిహారం, బొగ్గు ఉత్పత్తి వ్యయానికి ఏమాత్రం వ్యత్యాసం లేకుంటే సింగరేణి యాజమాన్యం ప్రాజెక్టు ఏర్పాటుపై పునరాలోచన చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఓపెన్‌కాస్ట్ ఏర్పాటు చేసి లాభాలు ఆర్జించే అవకాశం లేనప్పుడు పర్యావరణానికి నష్టం చేకూర్చడం ఎందుకనే ఆలోచనలో సింగరేణి యాజమాన్యం ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగానే ప్రాజెక్ట్‌కు సంబంధించిన పనులు అనుకున్నంత వేగంగా సాగడం లేదన్నట్లు సమాచారం. తొలుత గోలేటి ఓపెన్‌కాస్ట్ ఏర్పాటుపై దృష్టి సారించిన యాజమాన్యం ఆ తరువాత ఎంవీకే ఓపెన్‌కాస్ట్‌పై దృష్టి సారించనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో మహావీర్‌ఖని ఓపెన్‌కాస్ట్ ఏర్పాటుపై సానుకూల అంశాలు కానరావడం లేదు.

మైనింగ్ ప్లానింగ్ అప్రూవల్ రావాల్సి ఉంది

ఎంవీకే ఓసీపీకి మైనింగ్ ప్లానింగ్ అప్రూవల్ రావాల్సి ఉంది. ఇందుకోసం ప్రయత్నాలు చేస్తున్నాం. అప్రూవల్ వస్తే కానీ మిగతా దశల అనుమతి కోసం దరఖాస్తు చేసుకునే వీలులేదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో అన్నిరకాల అనుమతులు రావడానికి కనీసం రెండేళ్లు పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ఎంవీకే ఓసీపీపై యాజమాన్యం తుది నిర్ణయం తీసుకునే సూచనలు కనిపిస్తున్నాయి.

– రవిప్రసాద్, బెల్లంపల్లి ఏరియా జీఎం

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



అజయ్(ఫైల్)

జైపూర్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం మద్దులపల్లి గ్రామానికి చెందిన సోల్లూరి అజయ్ (22) గురువారం ద్విచక్ర వాహనంపై ఇందారంకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా టేకుమట్ల గ్రామ శివారులోని మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి పోచం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధుడు ఆత్మహత్య

రామకృష్ణాపూర్: అనారోగ్య కారణాలతో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని ఏజోన్ గణేశ్‌నగర్‌కు చెందిన సయ్యద్ చాంద్ (77) అనే సింగరేణి రిటైర్డ్ కార్మికుడు గురువారం తెల్లవారు జామున ఇంట్లో లుంగీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంటర్ విద్యార్థి బలవన్మరణం



అరవింద్ (ఫైల్)

నస్పూర్: ఇంటర్‌లో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురైన విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుభాష్‌నగర్‌కు చెందిన ఎస్.అరవింద్(17) మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం వెలువడిన ఫలితాల్లో మ్యాథమెటిక్స్‌లో ఫెయిలయ్యాడు. దీంతో మనస్తాపానికి గురైన అరవింద్ గురువారం ఇంటి వెనుకాల ఉన్న దూలానికి చున్నీతో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుని తండ్రి రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

సేంద్రియ మేళాకు మంత్రికి ఆహ్వానం



మంత్రితో సేంద్రియ వ్యవసాయదారులు

మంచిర్యాలటౌన్: ఈ నెల 30, మే 1వ తేదీల్లో మంచిర్యాలలోని వైశ్య భవన్‌లో నిర్వహించనున్న సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల మేళాకు హాజరు కావాలని నిర్వాహకులు గురువారం ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబును మంథనిలో కలిసి కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి మేళాకు వస్తానని మాట ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో పి.శ్రీనివాసరావు, బొడ్డు శంకర్, సింగతి మురళి, జితేందర్, బి.శంకర్ ఉన్నారు.

కేయూ డిగ్రీ సెమిస్టర్ల పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, తదితర కోర్సుల్లో 2వ, 6వ సెమిస్టర్ పరీక్షలు మే 6 నుంచి, నాలుగో సెమిస్టర్ పరీక్షలు మే 7 నుంచి జరగనున్నాయి. ఈ మేరకు పరీక్షల షెడ్యూల్ విడుదల చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి గురువారం తెలిపారు. రెండో సెమిస్టర్ పరీక్షలు మే 6, 8, 10, 16, 18, 21, 24, 27వ తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు మే 7, 9, 15, 17, 20, 22, 25, 28 తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆరో సెమిస్టర్ పరీక్షలు మే 6, 8, 10, 16, 18, 21, 24, 27, 29, 31 తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటాయి. పూర్తి వివరాలకు www. kakatiya. ac. in వెబ్‌సైట్‌లో చూడవచ్చని అధికారులు సూచించారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

భీమిని: మండలంలోని వెంకటాపూర్‌లో గురువారం నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నట్లు ఎస్సై గంగారాం తెలిపారు. వెంకటాపూర్ గ్రామానికి చెందిన పున్నపురెడ్డి చంద్రయ్య వద్ద 4 కిలోల నకిలీ పత్తి విత్తనాలు లభించాయి. దీంతో అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జేఈఈ మెయిన్‌లో 'నవోదయ' విద్యార్థుల ప్రతిభ

కాగజ్‌నగర్‌రూరల్: జేఈఈ మెయిన్ ఫలితాల్లో కాగజ్‌నగర్ పట్టణంలోని జవహర్ నవోదయ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని ప్రిన్సిపాల్ చక్రపాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 మంది విద్యార్థులు క్వాలిఫై అయినట్లు ఆయన పేర్కొన్నారు. ఒకరు 90 శాతం, ఇద్దరు 85 శాతం, నలుగురు 80 శాతం పర్సంటేజ్ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు.

అర్ధరాత్రి అగ్ని ప్రమాదం

- జిల్లా కేంద్రంలోని ఫుట్‌వేర్ షాపులో ఘటన
- రూ.10 లక్షల ఆస్తి నష్టం



మంటలు ఆర్పుతున్న ఫైర్, పోలీస్ అధికారులు

మంచిర్యాలక్రైం: మంచిర్యాల జిల్లా కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి బొడ్డుపల్లి సునీల్‌కు చెందిన 9ఎక్స్ ఫుట్‌వేర్ షాపులో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఫుట్‌వేర్ షాపు పైన బ్యూటీ స్టూడియో బొటిక్స్ పార్లర్ యజమానురాలు ఫుట్‌వేర్‌లో నుంచి దట్టమైన పొగలు రావడాన్ని గమనించి ఫైర్, 100 డయల్‌కు సమాచారం అందించింది. ఘటనాస్థలికి చేరుకున్న సిబ్బంది షాపు షటర్ పగులగొట్టి మంటలు అదుపులోకి తెచ్చారు. అప్పటికే దుకాణంలోని కంప్యూటర్, ఫర్నిచర్, ఫుట్‌వేర్ సామాన్లు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు ఫైర్ అధికారి దేవేందర్ తెలిపారు.

మూడు గంటలు శ్రమించిన పోలీస్, ఫైర్ సిబ్బంది

పట్టణంలో ప్రధాన మార్కెట్ ఏరియా అయినందున పోలీస్, ఫైర్ సిబ్బంది మూడు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఇందుకు ఉపయోగించిన బ్లోయర్ ఎంతో కీలకపాత్ర పోషించిందని అధికారులు తెలిపారు. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా భారీ ప్రమాదం జరిగి ఉండేదని పోలీస్ అధికారులు పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు ఫుట్‌వేర్ షాపును సందర్శించి యజమాని సునీల్‌ను పరామర్శించారు.

ఆవుపై దాడి చేసిన నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ అఫ్జలుద్దీన్

బెల్లంపల్లిరూరల్: మండలంలోని మాలగురిజాలలో మంగళవారం ఆవుపై గొడ్డలితో దాడి చేసిన నిందితులను అరెస్టు చేసినట్లు బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలుద్దీన్ తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మాలగురిజాల గ్రామానికి చెందిన చల్లూరి దయాకర్ ఆవుపై అదే గ్రామానికి చెందిన దుగుట వెంకటస్వామి, దుగ్నెపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి కళ్యాణ్, బట్వాన్‌పల్లికి చెందిన ఆకుదారి చంద్రశేఖర్ గొడ్డలితో దాడి చేసి నాలుగుకాళ్లు నరికివేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తాళ్లగురిజాల పోలీసులు నిందితులను చాకచక్యంగా పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి గొడ్డలి, కత్తి, రెండు కొబ్బరి తాళ్లు, ఒక స్కూటీని జప్తు చేసినట్లు తెలిపారు. దుగుట వెంకటస్వామి, కుమ్మరి కళ్యాణ్ లను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించగా మరో నిందితుడు ఆకుదారి చంద్రశేఖర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో తాళ్లగురిజాల ఎస్సై నరేష్ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ ప్రీమియర్ లీగ్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న శ్రీధర్

నస్పూర్: తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ స్టేట్ ఫస్ట్ లెవెల్ హ్యాండ్‌బాల్ ప్రీమియర్ లీగ్–2024 పోటీలను అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పెంచాల శ్రీధర్ బుధవారం రాత్రి ప్రారంభించారు. పట్టణ పరిధిలోని సాధన ఎక్సలెన్సియో పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. మరో రెండు రోజుల పాటు పోటీలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ కన్వీనర్ బొడ్డు విష్ణువర్ధన్, జిల్లా సెక్రటరీ తుండ్ల శ్రీనివాస్, అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సాంబమూర్తి, మారయ్య, తదితరులు పాల్గొన్నారు.

మైఖేల్ యోర్క్ చిత్రాలు గొప్పవి

- జూమ్ రౌండ్ టేబుల్ చర్చలో వక్తలు



మంచిర్యాలఅర్బన్: మైఖేల్ యోర్క్ డాక్యుమెంటరీలపై జూమ్ వేదికగా గురువారం రాత్రి 9 నుంచి 11గంటల వరకు చర్చ సాగింది. బ్రిటిష్ మానవ శాస్త్రవేత్త, ప్రఖ్యాత డాక్యుమెంటరీ చిత్ర దర్శకులు డా.మైఖేల్ యోర్క్ రూపొందించిన ఛాయాచిత్రాలు, అనువాద పుస్తకం, రాజ్‌గోండుల దండారీ పండుగపై డాక్యుమెంటరీ చలనచిత్రాలు, ఉమ్మడి ఆదిలాబాద్ రాజ్ గోండు సంస్కృతి సంప్రదాయాలు తదితర అంశాలపై చర్చించారు. అపర్ణ శర్మ (యూసీఎల్ఏ) అధ్యక్షతన జరిగిన చర్చలో ప్రముఖ చిత్ర దర్శకులు, మానవ శాస్త్రవేత్త మైఖేల్ యోర్క్, హెర్క్యులస్ సింగ్ ముండా (ఏడిన్ బర్గ్), అర్పిత్ గైండ్ (యూసీఎల్ఏ) సీనియర్ ఐఏఎస్ దివ్యాదేవరాజన్, ఉమ్మడి జిల్లా నుంచి సినీ గేయ రచయిత అక్కల చంద్రమౌళి, ఆదిలాబాద్ విభాగ ఆకాశవాణి మాజీ డైరెక్టర్ సుమనస్పతితో పాటు మొత్తం 56 మంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తేనే ఓటు..!

- ఎన్నికల బహిష్కరణకు గ్రామస్తుల తీర్మానం
- ఓటింగ్‌కు ఫలించని అధికారుల ప్రయత్నాలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

కోటపల్లి: ఆ మారుమూల గ్రామాన్ని సమస్యలు వెంటాడుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు మారుతున్నా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. పార్లమెంటు ఎన్నికలు రావడంతో గ్రామస్తులు సమావేశమై ఎన్నికల బహిష్కరణ అస్త్రాన్ని ప్రయోగించారు. సమస్యలు పరిష్కరిస్తే గానీ ఓటు వేయబోమని తీర్మానించారు. ఓటింగ్‌కు గ్రామస్తులను ఒప్పించాలని అధికారులు చేస్తున్న ప్రయత్నాలూ ఫలించడం లేదు. మండలంలోని మారుమూల గ్రామం కొత్తపల్లి రాజారంలో 300 ఇళ్లు ఉండగా 1025మంది జనాభా నివస్తున్నారు. 860 మంది ఓటర్లు ఉన్నారు. మండల కేంద్రం కోటపల్లి, అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం చెన్నూర్‌కు సుమారు 20కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. గ్రామానికి వెళ్లడానికి మట్టి రోడ్డు కూడా సక్రమంగా లేదు. కొత్తపల్లిరాజారం గ్రామానికి మధ్యలో ఉన్న వాగుపై గత ప్రభుత్వ హయాంలో వంతెన నిర్మాణానికి బీజం పడినా నిధులు లేక అసంపూర్తిగా మిగిలింది. దీంతో గ్రామంలోని విద్యార్థులు ఉన్నత చదువు కోసం సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలోని దేవులవాడ గ్రామానికి నడిచి వెళ్తుంటారు. వర్షాకాలంలో వాగుపై వంతెన లేకపోవడంతో చదువుకు దూరం కావాల్సి వస్తోంది. గ్రామం నుంచి పార్‌పల్లి మీదుగా మండల కేంద్రానికి వెళ్లాలన్నా ఇబ్బందులు పడాల్సిందే. రోడ్ల నిర్మాణానికి అనుమతులు వచ్చాయని, అటవీ అనుమతులు లేక నిర్మాణాలు జరగడం లేదని అధికారులు చెబుతున్నారు. అటవీ అనుమతుల విషయంలో చొరవ చూపడం లేదనే ఆరోపణలున్నాయి. ప్రస్తుత చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో గ్రామానికి రోడ్లు, వంతెన నిర్మాణానికి హామీనిచ్చారని, ఇప్పటికీ పరిష్కారానికి చొరవ చూపడం లేదని ఆరోపిస్తున్నారు. ఎన్నికల బహిష్కరణకు తీర్మానం చేసినా ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని మండిపడుతున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇప్పటికిప్పుడే రోడ్లు, వాగుపై వంతెన నిర్మాణాలు చేపట్టాలని తాము అనుకోవడంలేదని, కనీసం ఎమ్మెల్యేగా తన బాధ్యతగా గ్రామస్తులతో మాట్లాడే చొరవ తీసుకోవడంలో విఫలమయ్యారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో ఓటు వేయాలని గ్రామస్తులను ఒప్పించేందుకు ఎంపీడీవో భూమన్న, డీటీ నవీన్‌కుమార్, ఎస్సై రాజేందర్, ఆర్ఐ రాజలింగు గురువారం గ్రామ పంచాయతీలో వారితో సమావేశం అయ్యారు. అటవీ అనుమతులు రాకపోవడం వల్ల రోడ్ల నిర్మాణం జరగడం లేదని తెలుపగా.. స్పష్టమైన హామీనివ్వాలని గ్రామస్తులు పట్టుబట్టారు.

తీర్మానం చేసుకున్నాం..



నా పేరు వెల్పుల రా జయ్య. నాకు 55 సంవత్సరాలు. నా చిన్ననాటి నుంచి ఎన్నో ప్రభుత్వాలు, ఎంతో మంది నాయకులు మారినా గ్రామం అభివృద్ధి జరగలేదు. దేవులవాడ–కొత్తపల్లి రాజారం మధ్యలో వాగుపై వంతెన లేక గ్రామంలో ఎంతోమందికి ప్రాణహాని జరిగింది. ప్రభుత్వం ఇప్పటికైనా మా సమస్యలు తీరిస్తే ఓటు వేస్తాం. అభివృద్ధి జరిగే వరకు ఓటు వేయవద్దని గ్రామ పెద్దలందరం తీర్మానం చేసుకున్నాం.

– వేల్పుల రాజయ్య, గ్రామస్తుడు, రాజారం

గ్రామానికి రోడ్డు వేయాలి..



గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించి బస్సు వచ్చేలా చూడాలి. వ ర్షాకాలం వచ్చిందంటే మా గ్రామం బాహ్య ప్రపంచానికి దూరం కావాల్సిన పరిస్థితి ఉంటుంది. ప్రతియేటా ఎన్నికలప్పుడే నాయకులు వచ్చి హామీ ఇస్తున్నారే గానీ అభివృద్ధి జరగడంలేదు. ఈ సారైనా గ్రామ అభివృద్ధికి సహకరిస్తే తప్పక ఓటు వేస్తాం.

– సల్పాల ప్రవీణ్, కొత్తపల్లి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

కొత్తపల్లి రాజారం గ్రామస్తులు ఎన్నికలు బహిష్కరించిన విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. గ్రామానికి రోడ్ల అనుమతులు వచ్చాయి కానీ అటవీ అనుమతులు లేకపోవడంతో నిలిచిపోయాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో ఓటింగ్ జరిగేలా కృషి చేస్తాం.

– మహేంద్రనాథ్, తహసీల్దార్

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): బ్లూ కోల్ట్ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన హాజీపూర్ మండలం గుడిపేట గ్రామానికి చెందిన ఎంబడి వెంకటేశ్‌పై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. బ్లూ కోల్ట్ పోలీస్ కానిస్టేబుల్‌తో దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించినందుకు కేసు నమోదు చేసి 15 రోజులపాటు రిమాండ్‌కు తరలించినట్లు హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ తెలిపారు.

రూ.1,12,000 నగదు పట్టివేత

మంచిర్యాలక్రైం: పట్టణంలోని ఫ్లె ౖఓవర్‌బ్రిడ్జి వద్ద గురువారం నిర్వహించిన తనిఖీల్లో రూ.1,12,000 నగదు పట్టుబడినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా ఐబీ తాండూరుకు చెందిన కటకం నరేశ్ వద్ద రూ.61వేలు, మంచిర్యాల ఎల్ఐసీ కాలనీకి చెందిన వడ్ల ఆదిత్య వద్ద రూ. 51వేల నగదు పట్టుబడినట్లు ఆయన పేర్కొన్నారు. నగదును స్వాధీనం చేసుకుని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి వరలక్ష్మికి అప్పగించినట్లు తెలిపారు.

బార్‌లో ఏసీ మెకానిక్‌ల నిర్బంధం

- డయల్ 100కు ఫోన్
- బయటకు తెచ్చిన పోలీసులు



గదిలోపల ఉన్న టెక్నీషియన్లు

బెల్లంపల్లి: ఏసీలు మరమ్మతు చేయడానికి వచ్చిన ఇద్దరిని బెల్లంపల్లిలోని ఎస్ఆర్ఆర్ బార్ అండ్ రెస్టారెంట్‌లో యజమాని గురువారం నిర్బంధించారు. బాధితులు డయల్ 100కు ఫోన్ చేయడంతో పోలీసులు విడిపించారు. టూటౌన్ ఎస్సై రమేష్, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి కాల్‌టెక్స్ ఏరియాలోని ఎస్ఆర్ఆర్ బార్ అండ్ రెస్టారెంట్‌లో ఏసీలను ఆర్నెళ్లక్రితం మంచిర్యాల టెక్నీషియన్లు మరమ్మతు చేశారు. మళ్లీ పని చేయకపోవడంతో గురువారం టెక్నీషియన్లు మహ్మద్ సమీర్, హెల్పర్ ఎండీ.ఆసీఫ్‌ముస్తాఫాలను బార్ యజమాని సింగతి రవి పిలిపించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు రవి అతడి స్నేహితులు రాజ్‌కిరణ్, చిరంజీవి, మరో వ్యక్తి టెక్నీషియన్లతో గొడవపడి దూషించారు. ఓ గదిలో ఐదు గంటలపాటు నిర్బంధించారు. బాధితులు డయల్ 100కు ఫోన్ చేయడంతో టూటౌన్ పోలీసులు వెళ్లి విడిపించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై రమేష్ తెలిపారు.

ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో నెలరోజుల పాటు ఉచితంగా అందిస్తున్న క్రికెట్ శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ కోదాటి ప్రదీప్ అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలోని హెచ్‌సీఏ క్రికెట్ శిక్షణ శిబిరంలో గురువారం 100 మంది విద్యార్థులకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. శిక్షణలో అరటిపండ్లు, తాగునీటి వసతిని సైతం ఉచితంగానే అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఏ డిస్ట్రిక్ట్ కోచ్ పి. ప్రదీప్, సీనియర్ క్రికెటర్ వేణు, చందు, రాకేశ్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.